# స్పృహ

కామేశ్వర్రావు ఓరోజు ఆఫీసు డ్యూటీ మీదహఠాత్తుగా హైదరాబాదువెళ్ళాల్సి వచ్చింది. ముందుగా తెలియనందున "రిజర్వేషన్" కుదరలేదు. అయినాసరే. పాయిఖానాలోనన్నా ప్రయాణించి పని పూర్తి చేసుకు రమ్మని బాసుదేవుని ఆజ్ఞ.

ఫాస్టు ఎక్స్‌ప్రెస్ పదినిమిషాల్లో వస్తుందనగా ప్లాట్‌ఫాంమీదకు పరిగెత్తుకొచ్చాడు కామేశ్వర్రావు.

పుట్ట పగిలినట్లు జనం.

"ఇంత రష్‌లో రిజర్వేషన్ సంగతి దేవుడెరుగు. జనరల్ కంపార్ట్‌మెంటులో నన్నా సీటు దొరుకుతుందా?" అని దిగులు పడుతున్న కామేశ్వర్రావుకు దేవుడిలా దర్శనమిచ్చాడు 'వాడు'.

ఆ 'వాడు' వక్కిలా వున్నాడు, అస్తిపంజరానికి తోలు అంటించినట్లు. "సీటు కావాలా సార్?"— సెల్సు అయిపోయిన రేడియోలాగా గొంతు గరగర మంటూంది.

"కావాలి. నువ్వెలా సంపాదిస్తావ్?" అనడిగాడు కామేశ్వర్రావు.

"ఆ సీక్రెట్ మీకెందుకు సార్? సీటు కావాలంటే పది రూపాయలిటు పారేయండి. బండి రాగానే దర్జాగా వెళ్ళి కూర్చోండి" అన్నాడు వాడు మిస్టీరియస్‌గా నవ్వుతూ.

కామేశ్వరరావు పది రూపాయలూ పారేశాడు. బండి రాగానే దర్జాగా వెళ్ళి కూర్చున్నాడు.

కామేశ్వర్రావులాగా ఇంకా పది మంది అలా సీట్లు సంపాదించేరు. అవకాశం లేని వాళ్ళు కొట్టుకు ఛస్తున్నారు.

బండి కదలటానికి ఇంకా పది నిమిషాలుంది. కామేశ్వరర్రావు బుర్రలో బ్రహ్మపదార్థం తళుక్కుమని మెరిసింది.



వాడిని దగ్గరికి పిలిచి మరో ఐదు రూపాయలు చేతిలోపెట్టి వివరాలు అడగటం మొదలుపెట్టాడు.

"నీవిలా సీట్లు ఎలా సంపాదిస్తావ్?"

"మాదంతా ఒక గ్రూప్ సార్. కొంత మంది బండి అవుటర్ సిగ్నల్‌దగ్గర "స్లో" ఐపోగానే ఎక్కేసి గుడ్డలు పరిచేస్తారు. ప్లాట్‌ఫాంమీదకు రాగానే మీబోటివాళ్ళకు అమ్ముకుంటాం."

"పెట్టుబడిలేని వ్యాపారమన్నమాట. రోజుకెంత సంపాదిస్తారు?"

"రమారమి వందదాకా వుంటుందిసార్. స్టేషనోళ్ళకి సగం పోతుంది. మిగతా సగం మేమంతా పంచుకోవాలి. అయినా ఈ విషయాలన్నీ ఎందుకుసార్ అడుగుతున్నారు?" అన్నాడు వాడు.

"కథ రాయటానికోయ్. మీబోటివాళ్ళను గురించి రాస్తేనే ఇప్పుడు మంచి విలువ. ఇదివరకోసారి ఇలాగే కుష్టుపిల్లను గురించి రాస్తే వెయ్యి రూపాయలు బహుమతి వచ్చింది. అయినా మీరిలా చేయటం తప్పు కదూ! ప్రజలకోసం ప్రభుత్వం నడిపే రైళ్ళలో అక్రమంగా సీట్లు సంపాదించి అమ్ముకోవటం తప్పుకదూ?" అన్నాడు కామేశ్వర్రావు సీటులో సర్దుకు కూర్చుంటూ.

రైలుబండి పెద్దగా కూసింది.

వాడు వెంటనే ఒకే ఒక్కమాటనేశాడు- "మరేంచేయమంటారు సార్! మీలాగా కథలు రాసి అమ్ముకోటానికి చదువులేదుగా. అందుకే ఇట్లా సీట్లమ్ముకొంటున్నాం...."

"సామాజిక స్పృహ" సంగతటుంచి కామేశ్వర్రావుకు స్పృహ పోయినంత పనయింది.

కర్లపాలెం హనుమంతరావు

---

# ఏదాను ధర్మము



టైము ఏడౌతూంది.

చక్రధరరావ్ ఒక్కసారి వాచీ చూసుకొని తన ముందున్న క్యూని చూసి "ప్చ్— ఇవేళ కూడా లాభం లేదు. స్వామి వార్ని దర్శించి గీత వినే యోగం నాకు లేదు కాబోలు" అని ఒక్క క్షణం ఆలోచనల్లో పడి తిరిగి చకచకా రోగులను ప్రశ్నిస్తూ వాళ్ళ కళ్ళను పరీక్షిస్తూ అందుకనుగుణంగా తన పక్కనున్న పాత్రలోని మందును వాళ్ళకిస్తున్నాడు.

చక్రధరరావ్ వాళ్ళ కుటుంబం "పచ్చ కామెర్ల"కు ఇచ్చే మందువల్ల ఆ ఊళ్ళోనే కాకుండా ఆ చుట్టుప్రక్కల ఐదారు వందల మైళ్ళ దూరంవరకు ప్రసిద్ధిగాంచింది. అన్ని చోట్లా ఆశలువదులుకున్నవారు వీళ్ళ ఇంటి ముందు పడిగాపులు కాచేవారు. తండ్రి చనిపోయిన దగ్గర్నుంచీ అంటే దాదాపుగా పదిహేనేళ్ళనుంచి చక్రధరరావ్ ఆ కార్యక్రమాన్ని నిర్విరామంగా నిర్వహిస్తున్నాడు. దాదాపు అతని టైమంతా మందుకు కావల్సిన మూలికలను సంపాదించడం, వాటిని నూరి నిల్వచేయడం, రోగులను పరీక్షించి మందు ఇవ్వడంలోనే గడిచిపోతోంది

ఈ పనివల్ల అతనికొచ్చే లాభమేమీలేకపోగా బోల్డు ఖర్చు. ఆస్తి పాస్తులుండటం వలన అతనికేమీ ఇబ్బంది కల్గలేదు కానీ అతనికే ఈ మధ్య విసుగు పుడ్తూంది. అతని వయస్సు కూడా 40 ని చేరుకుంది. అందరిలా తను జీవించలేకపోతున్నందుకూ, పిల్లా పాపలతో సరదాగా కాలక్షేపం చేయలేక పోతున్నందుకూ, పుణ్య క్షేత్రాలు దర్శిస్తూ గుళ్ళకు వెళ్తూ భక్తి మార్గంలో కాలం గడపలేనందుకూ అతనిలో నైరాశ్యం పెరిగిపోతోంది.

ఈమధ్య ఊళ్ళోకి వచ్చిన స్వాముల వారి 'గీత' ఉపన్యాసాలు అత్యద్భుతంగా ఉన్నాయని అందరూ అనుకుంటుంటే అక్కడకు వెళ్ళాలనుకున్నాడు. కానీ అందుకు టైమే చిక్కడంలేదు. అందుకనే ఆ రోజు మనస్సు మరీ ఉదాసీనంగా ఉంది.

ఎంతో ప్రయత్నంమీద, చక్రధరరావ్ ఆ రాత్రికి స్వామివారి దగ్గరకు వెళ్ళాడు.

కుశలప్రశ్నలూ, మర్యాదలూ అయినాక ఎవ్వరూలేని సమయంలో తన మనస్సులోని గోడంతా వెళ్ళబోసుకున్నాడు స్వామివారి ముందు.

స్వామివారు ఒక్కక్షణం ఆలోచించి ఒక చిన్న కాగితంమీద ఏదోరాసి "ఇంటికి వెళ్ళి ప్రశాంత చిత్తంతో చదువుకో. నీ సమస్యకు సమాధానం బోధపడ్తుంది" అన్నారు.